మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

విద్యార్థిని అభినందిస్తున్న తహశీల్దార్

టి.నరసాపురం: క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడతాయని తహశీల్దార్ టి.సాయిబాబా తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించి క్రికెట్ అండర్-14 విభాగంలో జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన కాసగాని సాయి దీపక్‌ను అభినందించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు కొంత సమయం క్రీడలకు కేటాయించాలన్నారు. సాయిదీపక్ త్వరలో జమ్మూ కాశ్మీర్, ఒడిశా రాష్ట్రాల్లో జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి, పిడి అడపా రామకృష్ణ, కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వర్యా.. మీరున్నా ఇంతేనా..!

- సమాచార శాఖలో సమస్యల తిష్ట
- సిబ్బంది కొరత, సదుపాయాలలేమితో నిత్యం ఇబ్బందులే
- కీలకమైన డిపిఆర్ఓ పోస్టు ఖాళీ, డిఎల్‌పిఆర్ఓ, ఎపిఆర్ఓ పోస్టులూ అంతే
- వాహనాలు మూలనపడ్డా పట్టించుకునేవారే కరువు
- శాఖపై అనుభవం లేని అధికారి డిఐపిఆర్ఓగా నియామకం
- సమాచారశాఖ మంత్రి సొంత జిల్లాలోనే సమస్యలకు మోక్షం కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వానికి వెన్నుముకగా నిలిచే జిల్లాలోని సమాచార శాఖను పట్టించుకునే వారే లేకపోయారు. సమాచార శాఖా మంత్రి జిల్లాలోని సమస్యలకు మాత్రం మోక్షం కలగడం లేదు. పోస్టులన్నీ ఖాళీ అయిపోవడంతో వార్తల సేకరణకు ఒకేఒక్కరు అన్నట్లు పరిస్థితి తయారైంది. దీంతో ప్రభుత్వ కార్యక్రమాలు, జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాలకు సంబంధించిన వార్తల సేకరణ సమాచార శాఖకు నిత్యం సవాళ్లుగా మారాయి. వార్తల సకాలంలో రాకపోవడంతో ఒకపక్క జర్నలిస్టుల ఒత్తిడి.. మరోపక్క అధికారుల ఒత్తిడితో ఆ శాఖలోని సిబ్బంది అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఏలూరు జిల్లాలోని సమాచారశాఖలో కీలకమైన డిపిఆర్ఓ (జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్) పోస్టు ఖాళీగా ఉంది. డిపిఆర్ఒగా పని చేసిన అధికారికి ఉద్యోన్నతి రావడంతో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయారు. మరో అధికారిని నియమించకపోవడంతో డిపిఆర్ఓ పోస్టు ఖాళీగానే ఉంది. ఎపిఆర్ఓ పోస్టులు రెండు ఉండగా, ఒకరు మాత్రమే పని చేస్తున్నారు. డిపిఆర్ఓ పోస్టులు రెండు ఉండగా ఒక పోస్టు ఖాళీగా దర్శనమిస్తోంది. పబ్లిసిటీ అసిస్టెంట్లు నలుగురు ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేకుండాపోయారు. ప్రస్తుతం వార్తల సేకరణకు ఒకేఒక్క ఎపిఆర్ఓ మిగిలారు. దీంతో ప్రభుత్వ, జిల్లా కలెక్టర్ కార్యక్రమాలకు సంబంధించిన వార్తల సేకరణ సమాచార శాఖ సిబ్బందికి తీవ్ర కష్టంగా మారింది. ఇక సిఎం, మంత్రుల పర్యటనలు ఉంటే వారి పరిస్థితి అగమ్యగోచరమే అన్నట్లు తయారైంది. సమాచారశాఖలో ఇబ్బందుల గురించి జిల్లా అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా సమాచారశాఖ మంత్రిగా జిల్లాకు చెందిన కొలుసు పార్థసారధి ఉన్నారు. అయినప్పటికీ జిల్లా సమాచారశాఖలో ఇబ్బందులకు మోక్షం మాత్రం లభించడం లేదు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు తెలిసేలా చేయాలన్నా, జిల్లా అధికారుల నిర్ణయాలు ప్రజలకు చేరవేయాలన్నా సమాచార శాఖది కీలక పాత్ర. అటువంటి శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. జిల్లా సమాచారశాఖలో డిఐపిఆర్ఓ (జిల్లా ఇన్‌ఫర్మేషన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్) పోస్టు అత్యంత కీలకం. జిల్లా సమాచార శాఖ ఉన్నతాధికారిగా ఆ శాఖను నడిపించాల్సి ఉంటుంది. అలాంటి పోస్టులో రేడియో ఇంజినీర్ విభాగానికి సంబంధించిన అధికారిని నియమించారు. ఆయనకు సమాచారశాఖ విభాగంపై ఏమాత్రం అనుభవం లేదు. దీంతో ఆ శాఖను ముందుకు నడిపించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వార్తల సేకరణ సైతం చేయగలిగి, ఆ శాఖలో పూర్తి అనుభవం ఉన్న సామర్థ్యం ఉన్న అధికారిని డిఐపిఆర్ఒగా నియమించాల్సి ఉంది. అంతేకాకుండా వెంటనే రాష్ట్ర కేంద్రం నుంచి అవుట్ సోర్సింగ్ విధానంలోనైనా రెండు పిఆర్ఓ పోస్టులను భర్తీ చేయడంతోపాటు, ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాల్సి ఉంది. దీనిపై సమాచార శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తే సమస్యలకు కొంతమేరైనా పరిష్కారం లభిస్తుంది. సమాచారశాఖలో అత్యంత ముఖ్యమైన ఫొటోగ్రాఫర్ పోస్టు నియామకం లేకపోవడం ఒకింత ఆశ్చర్యం కలిగిస్తోంది.

మూలనపడ్డ వాహనం

మూలన పడ్డ వాహనాలు

సమాచార శాఖకు సంబంధించిన వాహనాలు పూర్తిగా మూలనపడ్డ పరిస్థితి ఉంది. ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలకు మీడియా ప్రతినిధులను తీసుకువెళ్లేందుకు స్వరాజ్‌మజదా వాహనం ఉండేది. అది పూర్తిగా దెబ్బతిని మూలకు చేరింది. ఆ స్థానంలో కొత్త వాహనం కొనుగోలు చేయాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. జిల్లా సమాచారశాఖ అధికారికి కేటాయించిన బొలేరో వాహనం వచ్చి 15 ఏళ్లు గడిచిపోయింది. తరచూ మరమ్మతులకు గురవడంతో అధికారులు నానావస్థలు పడుతున్నారు. ఇటీవల ఉంగుటూరు మండలంలో సిఎం పర్యటనకు వెళ్లేముందు వాహనం స్టార్ట్ కాకపోవడంతో సమాచారశాఖ అధికారులు సైతం మీడియా ప్రతినిధులతోపాటు బస్సులో వెళ్లాల్సి వచ్చింది. కొత్త వాహనాలు ఏర్పాటు చేయకపోతే ముందుందు సమాచార శాఖ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. సమాచార శాఖ మంత్రి జిల్లాకు చెందినవారే. వెంటనే జిల్లా సమాచారశాఖలో సమస్యలను పరిష్కరిస్తే ప్రభుత్వ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.

'పోలవరం'ను పోలవరం జిల్లాలో కలపాలి

జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యాన ఎంఎల్‌ఎకు వినతి



జీలుగుమిల్లి: వినతి అందిస్తున్న నేతలు, మహిళలు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

నూతనంగా ఏర్పాటు చేయబోయే పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కూడా కలపాలని జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి కార్యక్రమానికి విచ్చేసిన బాలరాజును జిల్లా సాధన కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా నేతలు ధర్ముల రమేష్, మడివి దుర్గారావు, ఊకె ముత్యాలరావు, సోడే సీతారామయ్య, మోహన్, ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రకటించిన పోలవరం జిల్లా ఏలూరు ఏజెన్సీ ప్రజలను నిరాశపర్చిందన్నారు. పోలవరం జిల్లాలో పోలవరం లేకపోవడం నేతి బీరకాయలో నెయ్యి లేనట్లే ఉందని తెలిపారు. ఆనాడు పోలవరం నిర్వాసిత ప్రాంతాన్ని ఒక జిల్లాగా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ఉల్లంఘించినట్లేనన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తి కావాలంటే నిర్వాసితులకు పునరావాసం పూర్తిస్థాయిలో కల్పించాలన్నా, అందుకు నిర్వాసిత ప్రాంతం, పునరావాసం కల్పించే ప్రాంతం ఒకే కార్యనిర్వాహక ప్రాంతంగా ఉంటే సమన్వయానికి, కార్యాచరణ అమలుకు పూర్తిస్థాయిలో వీలుంటుందని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలో ఉన్న షెడ్యూల్డ్ ప్రాంతం, నాన్ షెడ్యూల్డ్‌లో ఉన్న ఆదివాసీ గ్రామాలను కలిపి పోలవరం జిల్లాగా ప్రకటించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కృషి చేయాలని ఎంఎల్‌ఎకు విన్నవించారు. దీనిపై ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ కచ్చితంగా ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి మన నియోజకవర్గాన్ని కలపడం కోసం ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాలి రమేష్, పాయం సత్యం తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: రంపచోడవరం కేంద్రంగా పోలవరం పేరుతో ఏర్పడే జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని సిపిఎం మండల కన్వీనర్ సిరిబత్తుల సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తాటియాకులగూడెం సచివాలయ పరిధిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం, టి.నర్సాపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, గోపాలపురం, మండలాల్లోని షెడ్యూల్డ్ గ్రామాలను కలుపుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రీసర్వే డిటి పెద్దిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సుంకవల్లి శేషగిరిరావు, కారం బోడమ్మ, కోర్స జయ, పాపారావు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు

ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్

ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ సూచించారు. మంగళవారం ముదినేపల్లిలోని శ్రీరామ రైస్‌మిల్, పెదగొన్నూరు గౌతమి రైస్‌మిల్, కొత్తపల్లిలోని శ్రీ వెంకటరామ ఆగ్రో ఇండస్ట్రీస్‌ను ఆయన తనిఖీ చేశారు. వడాలి రైతు సేవాకేంద్రంలో చిరిగిపోయిన సంచులను పరిశీలించారు. రైతులకు చిరిగిపోయిన గన్ని బ్యాగులను సరఫరా చేయకూడదని వ్యవసాయ అధికారికి సూచించారు. రంగు మారిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ లతీఫ్‌పాషా, వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, ఆర్‌ఐ రాజశేఖర్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఆర్‌జెడిచే అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌జెడి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలో పలు అంగన్వాడీ కేంద్రాలను స్త్రీ, శిశుసంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.సుజాతరాణి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని దానిమ్మతోటలో 2, మండలంలోని మర్రిబంధంలో ఒక అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, పిల్లల హాజరు, రిజిస్టర్లలో అనేక సూచనలు చేశారు. విద్యార్థుల నూరు శాతం హాజరుకు, పరిపూర్ణ పౌష్టికాహారం పంపిణీకి కృషి చేయాలని అన్నారు.

టెట్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుండి 21వ తేదీ వరకు జరగనున్న 'టెట్' పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ అధికారులను ఆదేశించారు. టెట్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం ఆయన టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో రెండు కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను జేసీ ఆదేశించారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయమూ లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షకు హాజరయ్యే హాజరయ్యే అభ్యర్థుల ఫొటో కలిగిన హాల్ టిక్కెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, హాల్ టికెట్‌తోతోపాటు ఫోటో ఐడిని కూడా పరిశీలించాలన్నారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి డిఇఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలనీ డిఇఒను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ట్రాన్స్‌కో ఎస్ఇ సాల్మన్‌రాజు, ఆర్‌టిసి ఆర్ఎం షబ్నమ్, డిఎంహెచ్ఒ అమృతం, అధికారులు పాల్గొన్నారు.

బెదిరింపు కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి: డిఇఒ

ఏలూరు: జిలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేస్తున్నారని ఫుడ్ ఆఫీసర్ నారాయణ అనే పేరుతో ఎంఇఒలకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటువంటి ఫోన్ వచ్చిన వెంటనే మీ ఫోన్‌లో రికార్డింగ్ చేసుకుని, సదరు విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సదరు బ్లాక్‌మెయిలర్లకు ఎటువంటి సొమ్మూ చెల్లించొద్దని కోరారు.

సమ్మె బాటలో లారీ యజమానులు

- పెంచిన ఫిట్‌నెస్ భారం ఉపసంహరించాలని డిమాండ్
- ఫిట్‌నెస్ సెంటర్లు స్థానికంగానే నెలకొల్పాలని వినతి
- రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో నేటి నుంచి తలపెట్టిన సమ్మె తాత్కాలిక వాయిదా

ప్రజాశక్తి - పాలకొల్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కసారిగా లారీలతో పాటు రవాణా వాహనాల ఫిట్‌నెస్ ఛార్జీలను రూ.వందల నుంచి రూ.వేలకు పెంచడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా లారీ యజమానులు సమ్మెకు దిగుతున్నారు. ఇప్పటికే తేలికపాటి రవాణా వాహనాలు రావడంతో లారీ యాజమాన్యాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. ప్రస్తుతం కొత్త లారీలు కొనుగోలు చేసి వ్యాపారం చేసేవారే లేరు. గతంలో పాలకొల్లు యూనియన్‌లో 250 నుంచి 300 లారీలు ఉండేవి. ప్రస్తుతం 150 లారీలు మాత్రమే సంఘంలో ఉన్నాయి. అవీ పాత లారీలను బాగు చేసుకుని కేవలం స్థానిక రైల్వే వ్యాగన్ల కోసం ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఏడాదికి రూ.1,340 ఉన్న ఫిట్‌నెస్ ఛార్జీలను రూ.33,040కు పెంచడంతో లారీ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో గ్రీన్‌ట్యాక్స్ వేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పన్ను సగానికి తగ్గించింది. అయితే ప్రస్తుతం పన్నుల రూపంలో ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం సైతం పెంచిన ఫిట్‌నెస్ పన్నుపై ఏమీ మాట్లాడటం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. పైగా ఇంతవరకూ వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పాలకొల్లులోనే టెస్ట్ చేసేవారు. అయితే ప్రస్తుతం అమలాపురం, రాజమండ్రి, రాజానగరం, విజయవాడలో మాత్రమే ఫిట్‌నెస్ కేంద్రాలు పెట్టారు. భీమవరం దగ్గర మోగల్లులో కూడా పెడుతున్నారు. అసలే అంతంతమాత్రంగా ఉన్న రవాణా వాహనాలు ఈ కేంద్రాలకు వెళ్లాలంటే భారంతో కూడిన పని అని లారీ యజమానులు చెబుతున్నారు. మినీ వ్యాన్, ట్రాక్టర్లు కూడా ఫిట్‌నెస్ కోసం ఆయా కేంద్రాలకు వెళ్లాల్సిందే.

నేటి నుంచి సమ్మె.. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో వాయిదా

లారీ యజమానులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ పెంచిన భారాలను ఉపసంహరించాలని మంగళవారం రాత్రి నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. దీనికి వివిధ రూపాల్లో కూడా సన్నద్ధమయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సమస్యలపై చర్చ, పరిష్కారానికి నాలుగు రోజులు గడువు కోరడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు లారీ యజమానుల సంఘాలు ప్రకటించాయి.

లారీల సమ్మెతో పలు రంగాలపై ప్రభావం

లారీ యజమానులు సమ్మెకు దిగితే అనేక రంగాలపై ప్రభావం పడనుంది. ప్రస్తుతం ఖరీఫ్ ధాన్యం ముమ్మరంగా కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో రవాణా వాహనదారులు సమ్మెకు దిగితే ధాన్యం కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తేలికపాటి రవాణా వాహనాలు సైతం సమ్మెలో పాల్గొనే అవకాశం ఉంది. దీంతో ఇప్పటికే ఆటుపోట్ల నడుమ ఉన్న నిర్మాణ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం ఉంది. కంకర, మెటల్ లారీలు కూడా ముందుందు సమ్మెలో పాల్గొనే అవకాశం ఉంది. ఇప్పటికే లారీ యాజమాన్యం రాష్ట్ర రవాణా కమిషనర్ ఎమ్‌టి.కృష్ణబాబుతో కలిసి వాహనాల ఫిట్‌నెస్ పన్నును యధాతథంగా ఉంచాలని విజ్ఞప్తి చేసింది. పాలకొల్లు లారీ యాజమానులు మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి సమస్యను వివరించారు.

ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టమ్ పాలకొల్లులోనే నెలకొల్పాలి

పైలా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు, పాలకొల్లు లారీ అసోసియేషన్

పెంచిన పన్ను పోటు కాకుండా వాహనాల ఫిట్‌నెస్ కోసం రవాణా వాహనాలు తూర్పుగోదావరి జిల్లాలోని మూడు కేంద్రాలకు వెళ్లాల్సి రావడం భారంతో కూడింది. కాబట్టి భీమవరంతో పాటు పాలకొల్లులోనూ ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ నెలకొల్పాలి. పెంచిన ఛార్జీలు తగ్గించి లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి.

లారీల సమ్మె తాత్కాలిక వాయిదా

ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గురుజు సూరిబాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పాత వాహనాలపై కేంద్ర ప్రభుత్వం పెంచిన ఫిట్‌నెస్ ఛార్జీలకు వ్యతిరేకంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి తలపెట్టిన లారీల సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఎపి లారీ యజమానుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తాడేపల్లిగూడెం అసోసియేషన్ సెక్రటరీ గురజు సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం పెంచిన ఫిట్‌నెస్, టెస్టింగ్ ఛార్జీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ప్రస్తుతం ఉన్న రేట్లు హోల్డ్ చేస్తామని, అందుకుగాను నాలుగు రోజులు సమయం పడుతుందని వాహన యజమానులు సహకరించాలని కోరడంతో తాత్కాలికంగా సమ్మె విరమింపజేస్తున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాలు పైబడిన పాత వాహనాల ఫిట్‌నెస్ ఛార్జీలు పెంచడం వల్ల వాహన యజమానులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరైన కిరాయిలు లేక ఇబ్బంది పడుతున్న పాత వాహనాల యజమానులకు కేంద్ర ప్రభుత్వం పెంచిన ఛార్జీలు తలమానికమయ్యాయన్నారు. పాత లారీలకు పాత విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చెప్పిన విధంగా నాలుగు రోజుల్లో పెంచిన ఛార్జీలను రద్దు చేయకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రకృతి కూరగాయల అమ్మకానికి ప్రత్యేక దుకాణాలు

- నిత్యావసరాల ధరలు పెరగకుండా పర్యవేక్షణ
- ధరల పర్యవేక్షణ జిల్లా కమిటీ సమావేశంలో జెసి ఎంజె.అభిషేక్‌గౌడ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రకృతి సాగు ద్వారా పండించిన కూరగాయల అమ్మకానికి ప్రతి రైతు బజార్‌లోనూ రెండు దుకాణాలు కేటాయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెసి అభిషేక్‌గౌడ మాట్లాడుతూ జిల్లాలో కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం ద్వారా అనారోగ్యం పాలవుతారని, ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి సాగు ద్వారా పండించిన కూరగాయలను ప్రతి రైతుబజార్‌లో అమ్మేందుకు ప్రత్యేకంగా రెండు దుకాణాలు కేటాయించాలన్నారు. ఆహార పదార్థాలు, కూరగాయలకు ఆకర్షణీయత కోసం కృత్రిమ రంగులు వేసి అమ్ముతుంటారని, ఉదాహరణకు బఠాణికి ఆకుపచ్చ రంగు చేర్చడంతో కేన్సర్ వంటి రోగాల పాలవుతారన్నారు. ఇటువంటి పనులు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జెసి అధికారులను ఆదేశించారు. నిత్యావసర సరుకుల అక్రమ నిల్వలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలన్నారు. వ్యాపారులు పెద్దఎత్తున అక్రమ నిల్వలకు పాల్పడితే, గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. రైతుబజార్లలో తాగునీరు, టాయిలెట్లు వంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఉద్యానవన శాఖ డిడి షాజానాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి శ్రీనివాస్, జిల్లాలోని రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ప్రగతి సాధించాలి

జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రగతిని సాధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘాలు జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెసి అభిషేక్ గౌడ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రగతి సాధిస్తున్నామని, ఉద్యాన పంటల్లో పామాయిల్ అధిక విస్తీర్ణంలో సాగవుతుందన్నారు. అదేవిధంగా కోకో ఆయిల్‌పామ్, కొబ్బరి తోటల్లో అంతర పంటగా 35 వేల ఎకరాల్లో సాగవుతుందన్నారు. జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులకు అధిక రాబడి అందేలా చేయడమే రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ప్రధాన ఉద్దేశమన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లలో జిల్లా మంచి పురోగతి సాధించేలా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. సంఘాలకు సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతోపాటు, సబ్సిడీపై యాంత్రీకరణ కూడా అందిస్తారన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేసి, జిల్లాలో పెద్దఎత్తున రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాబార్డు ద్వారా 34, ఉద్యాన పంటలకు సంబంధించి 11, ఆక్వా రంగంలో 15, డిఆర్‌డిఎ ద్వారా 26 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు జిల్లాలో ఉన్నాయని సంబంధిత శాఖల అధికారులు తెలిపారు. సమావేశంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.భీమేశ్వరరావు, జిల్లా సహకార శాఖాధికారి ఆరిమిల్లి శ్రీనివాస్, డ్వామా పీడీ విజయరాజు, నాబార్డు డిడిఎం అనిల్‌కాంత్, ఎల్‌డిఎం నీలాద్రి, వ్యవసాయాధికారి హబీబ్‌భాషా, ఉద్యాన శాఖ డిడి షాజానాయక్, ఎఫ్‌పిఒ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీల కోసం డిమాండ్లు

నల్లమాడు, వెల్లమిల్లి, గొల్లగూడెం వాసుల్లో ఆశలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొత్త పంచాయతీల విభజనకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆవాస గ్రామాలను కొత్త పంచాయతీలుగా విభజించాలనే డిమాండ్లు తెరపైకొస్తున్నాయి. పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి, ప్రతిపాదిత పంచాయతీకి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నెంబర్లు విభజన తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాజాగా నూతన పంచాయతీలు, ఇతరత్రా సవరణకు పంచాయతీరాజ్ సుముఖత తెలుపుతూ వీటిపై ఉన్న నిషేధాన్ని ప్రస్తుతం సడలించింది. తద్వారా ఒక పంచాయతీని రెండింటిగా మార్పు చేయడం, రెండు పంచాయతీలను ఒకటి మార్చడం, ఒక పంచాయతీల్లోని గ్రామాన్ని మరో పంచాయతీలో విలీనం చేసే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వినతుల స్వీకరణతోపాటు కొత్త ప్రతిపాదనలు కోరుతూ జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి ఎంపిడిఒలకు ఉత్తర్వులు వచ్చాయి. ఈ క్రమంలో ఉంగుటూరు మండలంలో నల్లమాడు పంచాయతీ పరిధిలో రామచంద్రపురం, వెల్లమిల్లి పంచాయతీ పరిధిలో చినవెల్లమిల్లి, చింతాగూడెం, గొల్లగూడెం పంచాయతీ పరిధిలో కొత్తగూడెం ఆవాస గ్రామాలను విభజించాలనే ప్రతిపాదలను ఆయా గ్రామాల నాయకులు మంగళవారం ఎంపిడిఒకు మౌఖికంగా తెలిపారు. దీనిపై గ్రామస్తుల అభ్యర్థనలను ఎంఎల్‌ఎ ధర్మరాజు దృష్టికి తీసుకెళ్లి కొత్త పంచాయతీల ప్రతిపాదలను సిద్ధం చేయనున్నామని ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ ప్రజాశక్తికి వివరించారు. 1986లో మండల వ్యవస్థ వచ్చాక ఉంగుటూరు మండలంలో అప్పటి వరకూ ఉన్న 21 గ్రామాలను 27 గ్రామాలుగా విభజించారు. మళ్లీ 30 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఆ బాధ్యతలను ఈసారి జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు. దీనిపై ఉంగుటూరు మండలంలో ఆశావహులు ప్రయత్నాలు చేపట్టారు.

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ఉద్యోగుల సేవా వివరాలను నమోదు చేయాలి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న అన్ని కేడర్ ప్రభుత్వ ఉద్యోగుల సేవా వివరాలను డిజిటల్ రూపంలో సమగ్రంగా నమోదు చేసే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ ఉద్యోగులకు ప్రత్యేక సందేశం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రొఫార్మా-3, గూగుల్ ఫామ్ లింక్ ద్వారా తమ సేవా వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈ డేటా భవిష్యత్తులో ఉద్యోగులకు అనేక లబ్ధి అందిస్తుందన్నారు. ముఖ్యంగా ప్రమోషన్లు, బదిలీలు, సీనియారిటీ లిస్టులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో వేగవంతమైన, పారదర్శక నిర్ణయాలు తీసుకోవడం సులభం అవుతుందని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు రిటైర్‌మెంట్ సమయంలో పొందాల్సిన ప్రయోజనాల ప్రక్రియ కూడా ఈ కేంద్రీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా మరింత సులభం అవుతుందని ఛైర్‌పర్సన్ వివరించారు. జిల్లా పరిషత్ పరిపాలన డిజిటలైజేషన్‌లో ఇది ఒక ప్రధాన ముందడుగు అని చెప్పారు. ఉద్యోగులు కచ్చితమైన వివరాలను, నిర్ణీత సమయంలో పూర్తిగా నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సంబంధిత ఏఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అయాన్ ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్ విద్యార్థి కనకం పోష్వన్‌సాయి అయాన్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ నెల ఏడో తేదీన జంగారెడ్డిగూడెంలో అండర్-5 నుంచి అండర్-15 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో అండర్-7 కేటగిరీలో పోటీ పడిన పోష్వన్ సాయి అయాన్ మొదటి బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోనేరు సిద్ధార్థ ఆయనను అభినందించారు. చదరంగ క్రీడకు తమ పాఠశాలలో ఎల్లప్పుడూ ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. విద్యార్థిని స్కూల్ ప్రిన్సిపల్ సీమ మహంతి, అధ్యాపకులు ఆంధ్ర లక్ష్మీపార్వతి అభినందించారు. పోష్వన్ సాయి అయాన్ విజయంపై ఆయన తల్లిదండ్రులు కనకం బిద్రి, హరికిరణ్ కూడా యాజమాన్యం, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

బహుమతితో పోష్వన్‌సాయి అయాన్

విద్యార్థి సుహాన్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు అమలోద్భవి పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న అక్కపాము సుహాన్ జడివాల అవుట్‌డోర్‌లో జరిగిన ఆల్ ఇండియా ఆంధ్రప్రదేశ్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని బ్రౌంజ్ మెడల్ సాధించాడు. విద్యార్థి తండ్రి అక్కపాము రాంబాబు ఏలూరు ఎంఇఒ కార్యాలయంలో పని చేస్తున్నారు. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ క్లారా, పిఇటి రెడ్డి, ఉపాధ్యాయురాలు లక్ష్మి, కోచ్ దామిని అభినందించారు.



ప్రతిభ కనబర్చిన సుహాన్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా పట్టణానికి చెందిన నిరుపేద రజక కుటుంబానికి పునుగుపాటి లక్ష్మీపార్వతి పేగుల్లో రాళ్లు ఉండడం వల్ల తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమె కుమారుడు హరికిరణ్ కూడా బ్రెయిన్ ట్యూమర్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ అసోసియేషన్ సభ్యులు ఆ కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎపిఎంఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు చాటపర్తి పోసిబాబు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో అనేక మంది దాతలు ఉన్నారు. ఈ నిరుపేద కుటుంబం చికిత్సకు రూ.ఐదు లక్షల వరకు అవసరం ఉంది. అందరూ ముందుకొచ్చి ఆదుకోవాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సంపంగి నాని, మెట్ట సత్యనారాయణ, ములగాల లక్ష్మణ్, తలుపుల సుబ్రహ్మణ్యం, బెల్లంకి అప్పారావు, పేట మాణిక్యం, కంబాల రాంబాబు, యండమూరి రమేష్, చిలంతరాజుల వెంకటేశ్వరరావు, ములగాల మంగ, కూచింపూడి కృష్ణకుమారి, గుంపుల నాగరాజు, కడకట్ల కోటేశ్వరరావు, పల్లంట్ల సత్యనారాయణ, బండి శ్రీను, గుండెపల్లి దుర్గారావు, పాలూరి మధు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు అందించిన ఫర్నీచర్

పాఠశాలకు ఫర్నీచర్ అందజేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ములగలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40 ఏళ్ల క్రితం చదివిన పూర్వ విద్యార్థులు పలువురు పాఠశాలకు రూ.రెండు లక్షల విలువైన ఫర్నీచర్ అందించినట్లు హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు. ఐడిబిఐ బ్యాంక్ వారి సౌజన్యంతో కంప్యూటర్, కలర్ ప్రింటర్, కంప్యూటర్ టేబుల్స్, కుర్చీలు, సౌండ్ సిస్టమ్, బీరువా అందించినట్లు తెలిపారు. 40 ఏళ్ల క్రితం పాఠశాలలో చదివి పాఠశాలకు సామాజిక బాధ్యతతో ఫర్నీచర్ అందించడం అభినందనీయమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ రీజనల్ మేనేజర్ జిఎం కణ్వదబ్‌దాస్, పూర్వ విద్యార్థులు, సూర్య సంస్థల అధినేత శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం ఐడిబిఐ మేనేజర్ సునీల్‌కుమార్, రామకృష్ణ, నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు రాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడి పందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కోడేపందేలు నిర్వహిస్తున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మర్రిగూడెం గ్రామ శివార్లలో అక్రమంగా జరుగుతున్న కోడిపందేలు, జూద క్రీడలు వంటి కార్యకలాపాలపై వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద రూ.9,100 నగదు, మూడు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకుని వారి పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ముమ్మరంగా మాసూళ్లు

ధాన్యాన్ని ఆరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో సార్వా మాసూళ్లు తిరిగి ప్రారంభమయ్యాయి. పంట చేతికందే సమయంలో తుపాన్లు, అకాల వర్షాలతో ధాన్యం రైతులు పంటను రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. ఎండ రాకతో తడిసిన ధాన్యాన్ని అరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ తేమ శాతం ఎక్కువగా ఉండడంతో ప్రయివేట్ వ్యక్తులకు రైతులు ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తుంది. వరి కోతలు కోసి నూర్పుడి చేసి రైతులు కల్లాల వద్దే ధాన్యం నిల్వ ఉంచారు. మరికొంతమంది రైతులు రోడ్లపై ఆరబోశారు. ఎండ రాకతో ధాన్యాన్ని ఆరబెట్టే పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. కొందరు రైతులు బస్తాల్లో ధాన్యాన్ని నింపి మిల్లులకు తరలించే పనులు ముమ్మరం చేశారు. ప్రతి ఏటా ధాన్యం చేతికొచ్చే సమయంలో తుపాన్లు రైతులను దెబ్బ తీస్తున్నాయి. అక్టోబరు 28న మొంథా తుపాన్ వచ్చి వరి చేలను నాశనం చేసింది. వందల ఎకరాల్లో వరిచేలు చాపలా నేలకు అతుక్కుపోయి నీటిలో ధాన్యం గింజలు నాని పంట దిగుబడిపై దెబ్బకొట్టింది. ఎకరాకు 35 బస్తాల దిగుబడి వస్తుందని ఆశించగా కేవలం 25 బస్తాల దిగుబడితో సరిపెట్టుకోవాల్సి వస్తోందని రైతులు చెప్పారు. అక్టోబర్ నెలలో వచ్చిన తుపాన్ వల్ల ఎకరాకు పది బస్తాల ధాన్యాన్ని కోల్పోవాల్సి వచ్చిందని చెప్పారు. మరోవైపు నేలకు అతుక్కున్న వరి చేలల్లో కోతకు ఎకరాకు రూ.ఏడు వేల వరకు చెల్లించాల్సి వచ్చిందని, మిషన్‌తో కోయించాలంటే మూడు గంటల సమయం పడుతోందని, దీంతో మిషన్‌కు కోత కూలి రూ.పది వేల వరకు చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు. మొంథా తుపాన్ గండం నుంచి గట్టెక్కుతున్న తరుణంలో నెల రోజుల వ్యవధిలో దిత్వా తుపాన్ కంటిమీద కునుకు లేకుండా చేసింది. దిత్వా తుపాను బారిన పడకుండా ఉండేందుకు రైతులు ఒకేసారి యంత్రాలతో కోతలు కోయించినా ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలాల్లో నుంచి రోడ్లపైకి తెచ్చి అరబెట్టటం, మళ్లీ పోగు చేసి పరదాలు కప్పటం, మళ్లీ అరబెట్టటం ఇలా అన్నదాతలతో దిత్వా ఆటాడుకుంది. ఎండ రావడంతో రైతులు తిరిగి మాసూళ్లలో నిమగ్నమయ్యారు.

కుప్ప వేసేందుకు కట్టలు కడుతున్న కూలీలు

'మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ తగదు'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించాలని చూడడం సరికాదని నూజివీడు మాజీ ఎంఎల్‌ఎ వెంకటప్రతాప్‌అప్పారావు అన్నారు. పట్టణంలోని ద్వారకా ఎస్టేట్స్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై మాజీ సిఎం జగన్ ఆదేశంతో కోటి సంతకాల సేకరణలో భాగంగా 40 వేల సంతకాలు సేకరించామన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ గుడిమెళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై ఉద్యమం జయప్రదం'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై ప్రజల వ్యతిరేకత స్పష్టమైందని, వైసిపి చేపట్టిన ఉద్యమం విజయవంతమైందని వైసిపి మచిలీపట్నం పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు అధ్యక్షతన జంగారెడ్డిగూడెంలోని వైసిపి కార్యాలయంలో పార్టీ మండల, పట్టణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంభం విజయరాజు మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ చాలా వరకు పూర్తయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కర్పూరం నాని, మండలాధ్యక్షులు ఓరుగంట నాగేంద్ర, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాలొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

పేద కుటుంబాలకు సిఎం సహాయ నిధి నుంచి ఇచ్చే సొమ్ము ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జనసేన పార్టీ మండలాధ్యక్షులు గుణపర్తి వీరవెంకటసత్యనారాయణ (చిన్ని) అన్నారు. పోలవరంలో బిసి కాలనీకి చెందిన తిరుమలశెట్టి భార్గవ్‌సురేష్‌కు సిఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.47,900 చెక్కును జనసేన సీనియర్ నాయకుడు కొణతాల ప్రసాద్‌తో కలిసి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ పేదలు అనారోగ్యంతో ఆసుపత్రుల చుట్టూ తిరిగి భారమైన అప్పుల్లో కూరుకుపోవడం దురదృష్టకరమని, ఇలాంటి సమయంలో ప్రభుత్వంచే అందించే సిఎంఆర్‌ఎఫ్ నిధులు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని చెప్పారు. పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన చొరవతో నియోజకవర్గంలో ఇప్పటివరకు మొత్తం రూ.ఐదు కోట్ల సిఎంఆర్‌ఎఫ్ నిధులు బాధితులకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు అనిశెట్టి రాదయ్య, ఉడతా గణేష్, గోలి ప్రదీప్, బండి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ 79వ పుట్టినరోజు వేడుకను జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సోనియా గాంధీ రాజకీయ ప్రస్థానం, దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఎఐసిసి అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించిన ఆమె, ప్రధానమంత్రి పదవిని త్యజించిన మహనీయ నేత అని కొనియాడారు. నేతలు కేక్ కట్ చేసి సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ ఛైర్మన్ కొమ్మన సాంబశివరావు, కాంగ్రెస్ సిటీ జనరల్ సెక్రటరీ ప్రతాప్ సుబ్రహ్మణ్య శర్మ, దండుబోయిన చంద్రశేఖర్, ఆర్‌టిసి ప్రసాద్, వెంకట రాజు, సేవాదళ్ సుబ్బారావు, వేల్పుల వెంకటేశ్వరరావు, బిసి సెల్ వెంకటరమణ, భూషణం, కుమార్, నజీర్, కెఎస్ఎన్.మూర్తి తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా కిషోర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ పుట్టినరోజు వేడుకలు పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఎఐ కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కృషి

ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో ఎఐ కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు పనులు ప్రారంభమైనట్లు ఎంపీ మహేష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు కావాల్సిన రూ.2.5 కోట్ల ఖర్చును ఒఎన్‌జిసి సంస్థ సిఎస్‌ఆర్ నిధుల ద్వారా భరించేందుకు ఒప్పించినట్లు తెలిపారు. ఒఆర్‌ఆర్‌సి స్వచ్ఛంద సంస్థ సహకారంతో ల్యాబ్‌ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వచ్చే జనవరి నాటికి కళాశాల, పాఠశాలల్లో ల్యాబులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ ల్యాబ్‌ల ద్వారా ఏలూరు, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, కైకలూరు, చింతలపూడి, బుట్టాయగూడెం, నారాయణపురం డిగ్రీ కళాశాలలతో పాటు ఏలూరు, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, రాజవరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మూడు వేల మందికి పైగా విద్యార్థులకు ఎఐ నైపుణ్యాలు అందనున్నట్లు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విజన్‌కు అనుగుణంగా యువతకు ఆధునిక టెక్నాలజీ నేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ తెలిపారు. పూర్వ విద్యార్థులకు కూడా స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఎఐ శిక్షణ అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.

పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సహకరించాలి
కేంద్ర మంత్రిని కోరిన ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సహకారం అందించాలని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్‌ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కోరారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని పారిశ్రామిక పార్కుల వివరాలు కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. ఆయా రాష్ట్రాల విధానాలకు అనుగుణంగా వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక పార్కులు ఏర్పాటు అవుతున్నాయని, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడే విధంగా కేంద్ర ప్రభుత్వం, పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం, ఇతర కేంద్ర మంత్రిత్వ శాఖల ద్వారా కేంద్రం తన వంతు తోడ్పాటు అందిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరిక మేరకు ఆంధ్ర ప్రదేశ్ సహా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన పారిశ్రామిక పార్కుల వివరాలను మంత్రి సభకు వెల్లడించారు. రాష్ట్రంలో ముఖ్యంగా ఏలూరు జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సహకారం అందించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర మంత్రిని కోరారు.

సిఐటియు జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

విశాఖపట్నంలో ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి నాలుగో తేదీ వరకు సిఐటియు అఖిలభారత 18వ మహాసభ నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు తెలిపారు. ఈ మహాసభను విజయ వంతం చేయాలని కోరుతూ మంగళవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభకు 70 లక్షల మంది కార్మికులు, ఉద్యోగులు ప్రాతిని త్యం వహిస్తూ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాల నుంచి కార్మిక వర్గ పోరాట నాయకత్వం వహిస్తున్న కార్మిక నాయకులు మూడు వేల మంది హాజరవుతున్నారని తెలిపారు.

బుట్టాయగూడెం :సిఐటియు జాతీయ మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక ఆదివాసీ భవనం వద్ద మంగళవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.నాగమణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాన్ని కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును, పని గంటలను కోల్పోతున్నారన్నారు. ఈ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 ఇవ్వాలని, స్కీం వర్కర్లను, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ డైలీ వేజ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. జనవరి నాలుగో తేదీన విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభకు మండలంలోని కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పూనం శేఖర్, సిఐటియు మండల కో-కన్వీనర్ తెల్లం రామలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి పుష్ప, మంగతాయారు, భూదేవి, రామయమ్మ, సీతామాలక్ష్మి, నాగరత్నం, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడులో...

స్టడీ మెటీరియల్ అందజేత



ఏలూరు అర్బన్ : స్టడీ మెటీరియల్ అందిస్తున్న హెచ్‌ఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఎఆర్‌డిజికె ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు వివిఎస్ఎంఎల్.ప్రసూన పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న వంద మంది విద్యార్థులకు సుమారు రూ.ఎనిమిది వేల విలువైన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ గల ఉపాధ్యాయులతో రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను తన సొంత ఖర్చుతో కొనుగోలు చేసి మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాంతి జయకుమార్ చేతులమీదుగా విద్యార్థులకు అందించారు.

ముసునూరు :స్టడీ మెటీరియల్ వినియోగించుకుని పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని యుటిఎఫ్ మండలాధ్యక్ష, కార్యదర్శులు జి.పద్మకిషోర్, గుడిమెళ్ల రాంబాబు చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్, రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు కలిసి సుమారు రూ.ఎనిమిది వేలతో స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శైలజ, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వాణికుమారి, మండల సహాధ్యక్షులు పుల్లయ్య, ఉపాధ్యాయులు వెంకటరమణ, వీర రాంబాబు, గంగుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని విషయాల్లో అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ముసునూరు

డ్వాక్రా సంఘ సభ్యులకు అన్ని విషయాల్లో అవగాహన కల్పించాలని, విఒఎలు ఏ విధమైన ఫిర్యాదు లేకుండా పని చేయాలని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. వెలుగు కార్యాలయంలో ఎపిఎం కె.రాంబాబు ఆధ్వర్యంలో మండల జాగృతి మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం రాంబాబు మాట్లాడుతూ అన్ని గ్రామ సంఘాలు, గ్రూపు మీటింగ్స్ సక్రమంగా నిర్వహించాలని, పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. స్త్రీ నిధి మేనేజర్ గోపీనాథ్ మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాలకు సంబంధించి అధిక మొత్తంలో వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇసి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అండగా కూటమి ప్రభుత్వం

జనవాణి కార్యక్రమంలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రజాశక్తి - వేలేరుపాడు

రాష్ట్ర ప్రయోజనాల కోసం సర్వం త్యాగం చేస్తున్న మండల ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జనవాణి కార్యక్రమానికి మండలంలో ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి విచ్చేశారు. మండల వ్యాప్తంగా వచ్చిన సమస్యలను ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుడిని వ్యక్తిగతంగా కలుసుకుని వినిపించిన సమస్యలకు తక్షణ పరిష్కారం చేపట్టనున్నట్లు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా వినడం, వాటిని వెంటనే పరిష్కార దిశగా తీసుకెళ్లడం తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ప్రతి అభ్యర్థనను నమోదు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రతి అర్జీదారుడి సమస్యకు 15 రోజుల్లోగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. మండలంలో రూ.5.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ప్రధాన రహదారులకు గుళ్లవాయిలో శిలాఫలకవం ప్రారంభించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, జనసేన మండలాధ్యక్షులు గణేసుల ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి పోట్ల మోహన్‌దొర, దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పోడియం తులసి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి కొవ్వల క్రాంతికుమార్, రాయల రవికుమార్, మంచర్ల సమ్మయ్య, సోడే కళ్యాణ్, బుడిపుటి సురేష్, సావిలి ఆనందరావు, టిడిపి సీనియర్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, యాళ్ల శంకరం, కొర్రి కౌశిక్, బిజెపి ప్రధాన కార్యదర్శి సారే బాబ్జి, వివిధ శాఖల అధికారులు, పి4 టీమ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PENMATSA LEELA SUSHMA DEVI,** W/o. PENMATSA SAI DILIP KUMAR VARMA, Flat no : A2, Lakshmi Ganapathi Residency, Rajendhara Nagar, Palakol, W.G..Dist, A.P. I have changed my name **from DANTULURI LEELA SUSHMA DEVI (Old name) to PENMATSA LEELA SUSHMA DEVI (New name)** hence forth I am being called **PENMATSA LEELA SUSHMA DEVI** W/o. PENMATSA SAI DILIP KUMAR VARMA for all purposes

18న నూజివీడు ఎపి ఎన్‌జిఒస్ ఎన్నికలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎపి ఎన్‌జిఒ నూజివీడు తాలూకా యూనిట్ ఎన్నికలు ఈ నెల 18న నిర్వహించనున్నట్లు, 11న నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.నరేంద్రబాబు తెలిపారు. డిసెంబర్ 11న ఎపి ఎన్‌జిఒస్ భవనంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. నూజివీడు తాలూకా యూనిట్‌కు సంబంధించి ఒక అధ్యక్షుడు, ఒక సహాయ అధ్యక్షుడు, సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ట్రెజరర్ ఐదుగురు ఉపాధ్యక్షులు నలుగురు సంయుక్త కార్యదర్శి ఒక మహిళా సంయుక్త కార్యదర్శి కలిపి మొత్తం 15 పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నామినేషన్లు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సీకరిస్తామని, అనంతరం అదేరోజు నామినేషన్లు పరిశీలించి ఆఖరి జాబితా ప్రకటిస్తామని, నామినేషన్ ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఒక పోస్టుకు ఒకటికంటే ఎక్కువ నామినేషన్లు వస్తే ఈ నెల 18న ఎన్నికలు నిర్వహించి అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం.సాంబశివరావు, పరిశీలకులుగా జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం.ఝాన్సీ లక్ష్మీబాయి నియమించినట్లు ఆయన తెలిపారు.

13న నూజివీడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ తెలిపారు. ఎంపిపి ఆరేపల్లి శిరీష అధ్యక్షతన గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేయనున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై చర్చ కొనసాగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

CHANGE OF NAME

I **MUTYALA HARIBABU** S/o Mutyala Pullayya, D.No: - 3-48, Chaganti vari Meraka, Lakshmaneswaram, Narasapuram Mandal, W.G.Dt, A.P., I have changed my Name from **MUTHYALA HARIBABU** (Old Name) to **MUTYALA HARIBABU** (New Name). Henceforth I am being called **MUTYALA HARIBABU** S/o Mutyala Pullayya, for all purposes.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం కాపులపాలెంకు చెందిన అడ్డాల వాసు తండ్రి : ఆదినారాయణ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. ఇంటి దగ్గర నుండి కచేరి సెంటర్‌కు వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయింది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : P1970420 గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

అడ్రస్ : **అడ్డాల వాసు,**
తండ్రి : ఆదినారాయణ, కాపులపాలెం,
ఆచంట మండలం, పిన్ : 524123
సెల్ : 7093117564

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం కేశవరం గ్రామ కాపురస్తులైన కండవల్లి ప్రసాద్ తండ్రి సామ్యూల్ అను నేను నా యొక్క పాస్ పోర్ట్ నెంబర్ R0740502 గల్ల పాస్ పోర్ట్ పిప్పర గ్రామంలో జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి కేశవరం వెళ్ళే మార్గ మధ్యలో ఒరిజినల్ పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది నెంబర్‌కు తెలియజేయగలరు.

కండవల్లి ప్రసాద్, తండ్రి సామ్యూల్
కేశవరం గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా. సెల్: 9505091554

వేలం ప్రకటన
మహారాజశ్రీ నూజివీడు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.10/2024
O.S.234/2016

Between:
సమ్మెట ఝాన్సీరాణి మరియిద్దరు ...DHrs
Vs
కలపాల వరమ్మ మరి యొకరు ...J.Drs

ఈ J.Dr లచే తనఖా ఏర్పరిచిన దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థి ది.19.12.2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥ల లగాయితు పైకోర్టు వారిచే పైకోర్టులో వేలం వేయబడును. కావలసిన వారు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు :
పూర్వం కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిష్టార్ ఇలాకా, ఆగిరిపల్లి మండలం, పోతవరప్పాడు గ్రామంలోని లోని R.S.No.198/2A లోని ఎ 0.79 సెం మరియు R.S.No.198/2E లోని ఎ 0. 89 సెం. వెరశి ఎ 1.68 సెం భూమికి హద్దులు :
తూర్పు: మండా అబ్రహాం గారి భూమి
దక్షిణం: లింగంపల్లి ప్రకాష్ గారి భూమి
పడమర : కంభంపాటి ధర్మారావు గారి భూమి
ఉత్తరం: పోతవరప్పాడు పొలిమేర
ఈ హద్దుల మధ్యన గల ఎ 1-68 సెం భూమికి
D.Hr విలువ : రూ.20,00,000/-
అమీనా విలువ : రూ.30,00,000/-
వేలం తేదీ : 19.12.2025
Further hearing Date : 30.12.2025
నూజివీడు **ఎస్.వి.భవాని కుమార్**
ది.17.11.2025 న్యాయవాది, నూజివీడు